బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం 24 నవంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

## డిసెంబర్ 8 నుంచి అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో అగ్నివీరుల రిక్రూట్‌మెంట్ ర్యాలీ తేదీలు ఖరారయ్యాయి. డిసెంబర్ 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఈ నియామక ర్యాలీలు నిర్వహించనున్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి అథ్లెటిక్ స్టేడియంలో ఈ ర్యాలీలు జరగనున్నాయి. ఈ నియామకాల్లో భాగంగా అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్,అ గ్నివీర్ క్లర్క్/ స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ కేటగిరీల్లో భర్తీలు చేయనున్నారు. తెలంగా, ఏపీ, తమిళనాడు, పుదుచ్చేరి( కరైకల్-యానాం ) మహిళా మిలటరీ పోలీస్ అభ్యర్థులు.. 2024 ఫిబ్రవరి 12వ తేదీ నాటి ర్యాలీ నోటిఫికేషన్ ప్రకారం అవసరమైన అన్ని డాక్యుమెంట్లను తప్పనిసరిగా తీసుకురావాలని అధికారులు సూచించారు. ఈ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరగుతుందని అధికారులు తెలిపారు. నియామక ర్యాలీలో ఉత్తీర్ణత సాధించడానికి సాయం చేస్తామని ఎవరైనా చెబితే నమ్మవద్దని సూచించారు. మోసపూరిత ట్వీట్లు, మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే.. రిక్రూట్‌మెంట్ కార్యాలయానికి చెందిన ఫోన్ నంబర్లు 040-27740059, 27740205 సంప్రదించాలని సూచించారు.

### ప్రజా పాలన
# విజయోత్సవాలు నిర్వహించాలి

- సీఎం రేవంత్‌రెడ్డి
- సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 1 నుంచి 9 వ తేదీ వరకు రాష్ట్రమంతా పండుగ వాతావరణం వెల్లివిరిసేలా ప్రజా పాలన విజయోత్సవాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో విజయోత్సవాల నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

తొలి ఏడాదిలో ప్రభుత్వం సాధించిన విజయాలతో పాటు భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాల ప్రణాళికను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజా పాలన - విజయోత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై ముఖ్యమంత్రి సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారుల సమావేశంలో సమీక్షించారు. ఈ నెల 30వ తేదీన మహబూబ్‌నగర్‌లో రైతులకు అవగాహన కల్పించే రీతిలో రైతు సదస్సుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.

"డిసెంబర్ 4 వ తేదీన పెద్దపల్లి జిల్లాలో నిరుద్యోగ యువతతో విజయోత్సవ సభ జరపాలి. ఆ వేదికగా గ్రూప్ 4 తో పాటు వివిధ రిక్రూట్‌మెంట్ల ద్వారా ఎంపికైన 9 వేల మందికి నియామక పత్రాలు అందించాలి. డిసెంబర్ 1 వ తేదీ నుంచి శాఖల వారీగా నిర్దేశించిన మేరకు వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఈ వారం రోజుల్లో జరిగేలా ప్రణాళికను రూపొందించాలి. తొలి ఏడాదిలో చేపట్టిన కార్యక్రమాల ప్రగతి నివేదికతో పాటు భవిష్యత్తు ప్రణాళికను ప్రజల ముందు ఆవిష్కరించాలి. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో రాష్ట్రమంతటా పండుగ వాతావరణం వెల్లివిరిసేలా ఉత్సవాలు నిర్వహించాలి. ఈ మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో సచివాలయ పరిసరాలు, ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్ ప్రాంతమంతా తెలంగాణ వైభవం వెల్లివిరిసేలా ఉత్సవాలు నిర్వహించాలి.

పరిసరాల్లో ఎగ్జిబిషన్ లాంటి వాతావరణం ఉండేలా వివిధ స్టాళ్లను ఏర్పాటు చేయాలి. మూడు రోజుల పాటు తెలంగాణ సంస్కృతి, కళారూపాలు ఉట్టి పడే కార్యక్రమాలతో పాటు మ్యూజికల్ షోలు, ఎయిర్ షో, కన్నుల పండువలా ఉండే డ్రోన్ షోలను నిర్వహించాలి. రాష్ట్ర మంతటా అన్ని పాఠశాలలు, హాస్టళ్లు, కాలేజీల్లోనూ ప్రజా పాలన విజయోత్సవ వేడుకలు నిర్వహించాలి. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉత్సవ వాతావరణం ఉట్టిపడాలి.డిసెంబర్ 9 న సచివాలయ ముఖద్వారం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించాలి. ఈ వేడుకలకు తెలంగాణ ఉద్యమకారులు, మేధావులు, విద్యావంతులను, వివిధ రంగాల్లో ప్రతిభ సాధించిన వారందరినీ ఆహ్వానించాలి.

ప్రతి నియోజకవర్గానికి వెయ్యి మంది చొప్పున మహిళా శక్తి ప్రతినిధులను ఆహ్వానించి... లక్ష మంది తెలంగాణ తల్లుల సమక్షంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేయాలి. డిసెంబర్ 7 నుంచి 9 వరకు హైదరాబాద్ నగరంలో జరిగే ఉత్సవాల సందర్భంగా నగరంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీసులు తగిన చర్యలు చేపట్టాలి" అని అన్నారు. ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, పొన్నం ప్రభాకర్ గారు, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవ రావు , వేం నరేందర్ రెడ్డి , శ్రీనివాసరాజు , సీఎస్ శాంతికుమారి , డీజీపీ జితేందర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు



## ఫార్మా సిటీ కాదు.. ఇండస్ట్రియల్ కారిడార్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

కొడంగల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయబోయేది ఫార్మా సిటీ కాదని, ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గంలో యువత, మహిళలకు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ఇండస్ట్రియల్ కారిడార్‌ను ప్రతిపాదించినట్టు చెప్పారు.

??కొడంగల్ నియోజకవర్గం లగచర్ల ఘటనపై సీపీఐ, సీపీఎం, ఎంసీపీఐ(యు), ఆర్ఎస్పీ, సీపీఐ (ఎంఎల్ %-% లిబరేషన్) తదితర పార్టీల నాయకుల ప్రతినిధి బృందం సీఎం గారిని సచివాలయంలో కలిసి ఒక వినతి పత్రాన్ని సమర్పించారు.

??ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధికి చేపడుతున్న ప్రణాళికలను సమగ్రంగా వివరించారు. కొడంగల్‌లో ఏర్పాటు చేయబోయేది ఫార్మా సిటీ కాదన్న విషయాన్ని గుర్తుచేశారు.

??కొడంగల్ ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధి తన బాధ్యత అని, సొంత నియోజకవర్గ ప్రజలకు మేలు చేయాలన్నదే తన సంకల్పమని చెప్పారు.

??సొంత నియోజకవర్గ ప్రజలకు ప్రయోజనం చేయడమే తప్ప ఎవరికీ నష్టం కలిగించడం లేదని చెప్పారు. ఉపాధికి అవకాశాలు పెంచే దిశగా ఇండస్ట్రియల్ కారిడార్‌లో కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు.

??భూ సేకరణ విషయంలో పరిహారం పెంచాలన్న అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

??సీపీఐ శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు గారు, సీపీఎం రాష్ట్ర నాయకులు తమ్మినేని వీరభద్రం గారు, జూలకంటి రంగారెడ్డి గారితో పాటు ఇతర నాయకులు సీఎం గారిని కలిసిన వారిలో ఉన్నారు.

## రాహుల్ గాంధీ చిలకపలుకులకు మహారాష్ట్ర ప్రజలు స్పందించలేదు

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్



రాహుల్ గాంధీ చిలకపలుకులకు మహారాష్ట్ర ప్రజలు ఏమాత్రం స్పందించలేదని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి. కిషన్ రెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాం.దేశానికి ఆర్థిక రాజధాని మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ అనేక రకాల తప్పుడు ప్రచారం చేసినా కూడా అక్కడి ప్రజలు మోడీ నాయకత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్ కే అత్యధిక ఓట్లు, సీట్లతో మరోసారి పట్టం కట్టారు.

బీజేపీకి వ్యతిరేకంగా గత పార్లమెంటు ఎన్నికల్లో... బిజెపి వస్తే రిజర్వేషన్లు పోతాయని, మరాఠీలకు అన్యాయం జరుగుతందని ప్రచారం చేసి కొంత లబ్ధిపొందారు. కానీ, కేవలం 5 నెలల్లోనే ప్రజలకు వాస్తవం అర్థమైంది. ఇంత పెద్ద విజయం అందించారు. మహారాష్ట్ర, గుజరాత్ విడిపోయినప్పుడు జరిగిన ఎన్నికల తర్వాత మహాయుతి కూటమికి ఇంత పెద్ద విజయం రావడం మొదటిసారి. దేశంలో కులం, భాష, మతం పేరుతో కాంగ్రెస్ పార్టీ అనేక రకాలుగా ప్రజలను ఇబ్బంది పెట్టింది. దేశంలో అనేక రకాల నష్టాలకు కారణం కాంగ్రెస్ పార్టీ. రాహుల్ గాంధీకి ఈమధ్య మతిమరుపు ఎక్కువ పెరిగింది. దేశంలో అనేక సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీ పాలనను వెలగబెట్టిందనే విషయాన్ని మరచిపోయి మాట్లాడుతున్నాడు. కానీ, కాంగ్రెస్ పార్టీ దేశానికి అనేక నష్టాలు చేసి... బిజెపినే కారణం అంటూ తప్పుడు ప్రచారంతో వితండవాదం చేస్తున్నాడు. రాహుల్ గాంధీ చిలకపలుకులకు మహారాష్ట్ర ప్రజలు ఏమాత్రం స్పందించలేదు. జార్ఖండ్, మహారాష్ట్రలో కలిపితే 30సీట్లు కూడా కాంగ్రెస్ పార్టీకి దాటే పరిస్థితి కనబడడంలేదు. అంతటి ప్రజావ్యతిరేకత కూడగట్టుకున్నది. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విషప్రచారం చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ అబద్ధాలను, అసత్యాలను ప్రజలు నమ్మలేదు.. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో మెజారిటీ సీట్లలో మహాయుతి కూటమి విజయం సాధించింది. నేడు దేశంలో కాంగ్రెస్ పార్టీ మూడు రాష్ట్రాలకే పరిమితమైంది. గ్యారంటీల పేరుతో మభ్యపెట్టిన కర్నాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకే పరిమితమైంది. ఎన్నికల ఫలితాలకు ముందే.. తమ పార్టీ ఎమ్మెల్యేలను తరలించేందుకు కాంగ్రెస్ పార్టీ 4 ప్రత్యేక విమానాలను బుక్ చేసుకుంది. దేశ ప్రజలముందు కాంగ్రెస్ పార్టీ మరోసారి నవ్వులపాలైంది. గౌరవనీయులు బాలాసాహెబ్ థాక్రే గారి రాజకీయ వారసత్వం ఉద్ధవ్ థాక్రే కు లేదని నిరూపితమైంది." అని అన్నారు.

# మహారాష్ట్రలో ఎన్డీఏ

# జార్ఖండ్‌లో ఇండియా

**మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. మహారాష్ట్రలో ఎన్డీఏ కూటమి విజయం సాధించగా, జార్ఖండ్‌లో ఇండియా బ్లాక్ ఘన విజయం సాధించింది. రెండు రాష్ట్రాల్లో ఆయా కూటములు భారీ విజయాన్ని సొంతం చేసుకు న్నాయి. మహారాష్ట్రలో మహాయుతి గెలవగా.. జార్ఖండ్‌లో సీఎం హేమంత్ సోరెన్‌కే ప్రజలు జై కొట్టారు. జేఎంఎంకు మరోసారి అవకాశమిచ్చారు.**



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి ఘన విజయం సాధించింది. క్లియర్ మెజారిటీ సాధించింది. మరోవైపు, మహా వికాస్ అఘాడీ కౌంటింగ్ ప్రారంభం నుంచి వెనుకంజలో ఉంది. ఇదిలా ఉండగా, మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రిని తేల్చేందుకు బీజేపీ కేంద్ర పరిశీలకులు ముంబయికి చేరుకోనున్నారు.

మహారాష్ట్రలో అధికార మహాయుతి కూటమి ఎగ్జిట్‌పోల్స్ అంచనాలను మించి మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంది. 288 స్థానాలకుగాను అధికార కూటమి 233 స్థానాల్లో విజయం సాధించింది. ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ 51 స్థానాలతో సరిపెటుకుంది. మొత్తంగా మహారాష్ట్రలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. బీజేపీ 132 స్థానాల్లో జయభేరి మోగించగా, శిండే నేతృత్వంలోని శివసేన 57, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ 41 స్థానాల్లో గెలిచాయి. మహాయుతి కూటమి పక్షాలైన జేఎస్ఎస్ 2, ఆర్ఎస్‌పీఎస్ ఒక స్థానంలో, ఆర్ఎస్‌వీఏ ఒక స్థానంలో విజయం సాధించాయి. ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) నామమాత్రంగానే ప్రభావం చూపింది. ఎంవీఏ 51 స్థానాల్లో గెలిచింది. ఎంవీఏలో శివసేన యూబీటీ 20, కాంగ్రెస్ 16, ఎన్సీపీ శరత్‌చంద్ర పవార్ పార్టీ 10 చోట్ల విజయం సాధించాయి. ఎంవీఏ కూటమిలోని పార్టీలైన సమాజ్‌వాదీ పార్టీ రెండు చోట్ల, సీపీఎం ఒక చోట, పీడబ్ల్యూపీఐ ఒక చోట గెలిచాయి. ఇతరులు 4 చోట్ల విజయం సాధించారు.

ఫడణవీస్ జయభేరిమహారాష్ట్ర ఎన్నికల్లో పలువురు ప్రముఖులు విజయం సాధించారు. కోప్రి-పచ్‌పఖడీ స్థానంలో మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ శిందే సుమారు 1,20,000 ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. బారామతిలో ఎన్సీపీ అభ్యర్థి, ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ దాదాపు 99,000 ఓట్ల తేడాతో గెలిచారు. నాగ్‌పుర్ నైరుతి స్థానంలో బీజేపీ అభ్యర్థి, ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ జయభేరి మోగించారు. ఇస్లాంపూర్‌లో ఎన్?సీపీ ఎస్పీ అభ్యర్థి జయంత్ పాటిల్ 13,000 ఓట్ల తేడాతో విజయం సాధించారు. వర్లీలో శివసేన యూబీటీ నేత ఆదిత్య ఠాక్రే 8,800 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

### జార్ఖండ్‌లో జేఎంఎం కూటమి విజయం

జార్ఖండ్‌లో అధికార జేఎంఎం కూటమి విజయం సాధించింది. 81 అసెంబ్లీ స్థానాలున్న జార్ఖండ్‌లో మెజార్టీ మార్క్ 41కాగా, ఏకంగా 56 స్థానాల్లో జేఎంఎం కూటమి గెలుపొందింది. 43 స్థానాల్లో పోటీ చేసిన జార్ఖండ్ ముక్తి మోర్చా జేఎంఎం ఏకంగా 34 చోట్ల గెలుపొందగా, మిత్రపక్షాలైన కాంగ్రెస్ 16 చోట్ల, ఆర్జేడీ నాలుగు స్థానాల్లో, సీపీఐ ఎంఎల్ రెండు స్థానాల్లో విజయం సాధించాయి. ఇక బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి 24 స్థానాలకే పరిమితమైంది. 68 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ కేవలం 21 స్థానాలే దక్కించుకోగా, మిత్రపక్షాలైన ఎల్‌జేపీ రామ్‌విలాస్ పాసవాన్ పార్టీ, జేడీయూ, ఏజేఎస్‌యూ తలో స్థానంలో గెలుపొందాయి. జేఎల్‌కేఎం పార్టీకి ఒక స్థానం దక్కింది.

బర్హెట్‌లో సీఎం హేమంత్ సోరెన్ 39 వేలకుపైగా ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఆయన భార్య కల్పనా సోరెన్ గండేలో 13 వేలకుపైగా ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. దుమ్కా అసెంబ్లీ నియోజకవర్గంలో హేమంత్ సోరెన్ సోదరుడు బసంత్ సోరెన్ 14,588 ఓట్ల మెజార్టీతో నెగ్గారు. ధన్వార్‌లో జార్ఖండ్ బీజేపీ అధ్యక్షుడు బాబులాల్ మరాండి 25 వేలకుపైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. సరయ్‌కెలాలో జార్ఖండ్ మాజీ సీఎం, బీజేపీ అభ్యర్థి చంపయీ సోరెన్ 20 వేలకుపైగా ఓట్ల ఆధిక్యంతో నెగ్గారు. చందన్‌కియారీ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి, జార్ఖండ్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత అమర్ కుమార్ మూడోస్థానంలో నిలిచారు. ఇక్కడ జేఎంఎం అభ్యర్థి ఉమాకాంత్ రజక్ 33 వేలకుపైగా ఓట్ల మెజార్టీతో నెగ్గారు.

### ఉపఎన్నికల్లో ఎన్డీఏదే హావా

దేశంలోని 15 రాష్ట్రాల్లోని 48 అసెంబ్లీ స్థానాలు, 2 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. మహారాష్ట్రలో ఒక ఎంపీ సీటు, కేరళలోని వయనాడ్ ఎంపీ సీటుకు ఉప ఎన్నికలు జరగ్గా వయనాడ్‌ను కాంగ్రెస్ గెలుచుకుంది. ఇక్కడ కాంగ్రెస్ తరపున పోటీ చేసిన ఆ పార్టీ అగ్రనేత ప్రియాంకగాంధీ 4లక్షలకుపైగా రికార్డు మెజారిటీ సాధించారు. మహారాష్ట్రలోని నాందేడ్ ఎంపీ సీటును బీజేపీ తన ఖాతాలో వేసుకుంది.

యూపీలో ఆరు అసెంబ్లీ స్థానాలను బీజేపీ తన ఖాతాలో వేసుకోగా రెండు చోట్ల సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) గెలిచింది. వెస్ట్‌బెంగాల్‌లో ఆరు అసెంబ్లీ సీట్లకు జరిగిన ఉప ఎన్నికల్లో అధికార టీఎంసీ మళ్లీ సత్తా చాటింది. ఇక్కడ ఆరింటికి ఆరు స్థానాలను మమతా బెనర్జీ పార్టీ కైవసం చేసుకుంది. బీహార్‌లో నాలుగు అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల్లో ఎన్డీయే క్లీన్ స్వీప్ చేసింది.

రాజస్థాన్‌లో ఉప ఎన్నికలు జరిగిన 7 అసెంబ్లీ సీట్లలో బీజేపీ 5 గెలుచుకుంది. ఒక సీటులో కాంగ్రెస్ ఆధిక్యంలో ఉండగా భారత్ ఆదివాసీ పార్టీ(బీఏడీవీపీ) ఒక సీటు గెలుచుకుంది. కర్ణాటకలోని 3 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో మూడింటిని అధికార కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. పంజాబ్‌లో మొత్తం నాలుగు స్థానాలకు ఉప ఎన్నికలు జరగగా మూడింటిలో ఆమ్‌ఆద్మీపార్టీ, ఒక సీటులో కాంగ్రెస్ పార్టీ గెలుపొందాయి. కేరళలో రెండు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నకలు జరగగా ఒక చోట అధికార సీపీఎం మరొకచోట కాంగ్రెస్ విజయం సాధించాయి.

అస్సాంలోని నాలుగు అసెంబ్లీ సీట్లకు ఉప ఎన్నికలు జరగగా నాలుగింటిలో రెండింటిని అధికార బీజేపీ ఒకటి కాంగ్రెస్ ఒకటి ఏజీపీ గెలుచుకున్నాయి. సిక్కింలోని రెండు అసెంబ్లీ సీట్లకు ఉప ఎన్నిక జరగగా రెండు సీట్లలో ఎస్‌కేఎం గెలుపొందింది. గుజరాత్‌లో ఒక అసెంబ్లీ సీటుకు ఉప ఎన్నిక జరగగా ఒక్క సీటులో బీజేపీ గెలుపొందింది. ఛత్తీస్‌గఢ్‌లో ఒక అసెంబ్లీ సీటుకు ఉప ఎన్నిక జరగగా దానిని బీజేపీ గెలుచుకుంది. ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరగగా ఇక్కడ బీజేపీ గెలుపొందింది. మేఘాలయాలోని ఒక అసెంబ్లీ సీటుకు ఉప ఎన్నిక జరగగా ఈ సీటును ఎన్‌పీపీ పార్టీ తన ఖాతాలో వేసుకుంది.





### 4 లక్షల రికార్డు మెజారిటీతో గెలిచిన ప్రియాంక గాంధీ

కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ మరోసారి భారీ విజయం సాధించింది. కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంకా గాంధీ సీపీఐ అభ్యర్థి సత్యన్ మొకేరిపై 4లక్షల 10 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. గతంలో రాహుల్‌గాంధీ ఇదే స్థానం నుంచి 3,64,422 ఓట్ల ఆధిక్యత సాధించారు.

## అమాయక రైతుల కుటుంబాల వెనుక కేసీఆర్ ఉన్నాడు.

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్



బలగం టీవి, హైదరాబాద్

" నరేందర్ రెడ్డికి, చేయని తప్పునకు జైల్లో ఉన్న 30 మంది అమాయక రైతుల కుటుంబాలకు ఒకటే చెబుతున్నాం మీరు భయపడాల్సిన అవసరం లేదు. మీ వెనుక కేసీఆర్ ఉన్నాడు. తప్పకుండా న్యాయం, ధర్మం గెలుస్తుంది" అని కేటీఆర్ అన్నారు. చర్లపల్లి జైల్లో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ "పేద, గిరిజన, బలహీనవర్గాల రైతుల తరపున పోరాటం చేసిన పాపానికి జైలు పాలైన మా నరేందర్ రెడ్డిని చర్లపల్లి జైల్లో పరామర్శించాం. రేవంత్ రెడ్డి కక్షపూరిత వైఖరి కారణంగా చేయని తప్పునకు జైల్లో నరేందర్ రెడ్డి శిక్ష అనుభవిస్తున్నారు పట్నం నరేందర్ రెడ్డిని కలిసినప్పుడు ఆయన తన గురించి కాకుండా 30 మంది అమాయక రైతులను విడిపించండని చెప్పారు. అందుకు ఆయనకు అభినందనలుకొడంగల్‌లో దళిత, గిరిజన, బహుజన భూములు గుంజుకొని అక్కరలేని ఫార్మా విలేజ్‌ను రుద్దుతున్నారు. వారికోసం పోరాటం చేయండని చెబుతూ బాధపడుతున్నారు సంగారెడ్డి జైలు నుంచి చర్లపల్లి జైలు వరకు తప్పు చేయని అమాయకులు జైల్లో ఉన్నారుకానీ కొడంగల్ నుంచి కొండారెడ్డి పల్లె వరకు అరాచకాలు చేస్తున్న దుర్మార్గులు గద్దెనెక్కి కూర్చున్నారుకొడంగల్‌లో అర్ధరాత్రి పూట ఇళ్లపై పడి మహిళలు, పిల్లలపై అరాచకాలు చేస్తూ పేద రైతుల భూములు గుంజుకుంటున్నారు

రేవంత్ రెడ్డి సొంత ఊరు కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ 85 ఏళ్ల సాయిరెడ్డి అనే వ్యక్తిపై పగబట్టారు. రేవంత్ రెడ్డి కోసం ఆయన మొన్నటి ఎన్నికల్లో పనిచేశారు కానీ ఆయన ఇంటికి అడ్డంగా గోడకట్టి తోవ లేకుండా చేశారు. ఆ క్షోభ, అవమానంతో ఆయన ఆత్మహత్య చేసుకున్నారు నియంతలు, దుర్మార్గుల పాలనలోనే ఇలాంటి సంఘటనలు చూస్తుంటాం. గతంలో మేము అధికారంలో ఉన్నాం. ఎప్పుడైనా ఇలాంటి ఘటనల గురించి విన్నామా? సొంత ఊరు, సొంత నియోజకవర్గమైతే నీ సామ్రాజ్యమా, నువ్వు చక్రవర్తివా? వెయ్యి ఏళ్లు బతకటానికి వచ్చావా? సొంత ఊరు, సొంత నియోజకవర్గమైతే నేను ఆడింది ఆట, పాడింది పాట అంటే కుదరదు. నువ్వు నియంత కాదు. నువ్వు చక్రవర్తి కాదు. నీలాంటి వాళ్లు చాలా మంది కొట్టుకుపోయారు. నువ్వు కూడా కొట్టుకుపోతావ్. శిశుపాలుడి తప్పులను ఆనాడు లెక్కించినట్లు కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలు, రేవంత్ రెడ్డి పాపాలను ప్రజలు ఇప్పుడు లెక్కిస్తున్నారు

భూ కుంభకోణాలు, ఫార్మా విలేజ్ పేరుతో దౌర్జన్యాలు, పేద, గిరిజన రైతుల కుటుంబాల మీద అర్ధరాత్రి బందిపోట్ల మాదిరిగా పోలీసులు దాడి చేస్తున్నారు. అధికారం ఉంది కదా అని విచ్చలవిడిగా దౌర్జన్యం చేస్తూ సాయిరెడ్డి, గురువా రెడ్డి లాంటి వాళ్ల ఆత్మహత్యలు చేసుకునే విధంగా చేశారు. సొంత గ్రామంలో చేస్తున్న అరాచకాల పాపాలు పండే రోజు దగ్గర్లోనే ఉంది నీ కన్నా పెద్ద పెద్ద నియంతలు కూడా కొట్టుకుపోయారు మా నేత నరేందర్ రెడ్డి చాలా ధైర్యంగా ఉన్నాడు. పేదలు, గిరిజన రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరాడు మహబూబాబాద్‌లో మేము చేపట్టనున్న ధర్నా బాగా చేయాలంటూ మాకు ఉత్సాహానిచ్చారు రేవంత్ రెడ్డి మిమ్మల్ని నాలుగు రోజులు జైల్లో పెట్టవచ్చు. కానీ ఆయనకు మళ్లీ రాజకీయ జీవితం లేకుండా చేసే బాధ్యత మీ మీద ఉంది" అని అన్నారు.



## హైదరాబాద్ తాగునీటికి గోదావరి జలాలు

బలగం టీవి, హైదరాబాద్

హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం గోదావరి జలాలను వాడుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు తెలంగాణ కోర్ అర్బన్ రీజన్ హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాల కోసం 20 టీఎంసీల గోదావరి జలాలను తరలించడానికి సంబంధించి సమగ్రమైన నివేదిక తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. . ఇందుకు వచ్చే నెల 1 వ తేదీ వరకు టెండర్ల ప్రక్రియకు కార్యాచరణను రూపొందించాలని చెప్పారు. జంట నగరాల తాగునీటి అవసరాల కోసం 20 టీఎంసీల గోదావరి జలాలను తరలింపు అంశంపై జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి నీటి పారుదల శాఖ, జలమండలి అధికారుల సమావేశంలో సమీక్షించారు.హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల నుంచి నీటి తరలింపు ప్రణాళికలపై నివేదిక తయారు చేయాలని సూచించారు. నీటి లభ్యత, ఏ ప్రాజెక్టు నుంచి ఎంతమేరకు నీటిని తరలించాలి, ఎంత ఖర్చవుతుందన్న విషయాలపై పూర్తి అధ్యయనం జరగాలని ఆదేశించారు. ఈ విషయంలో మిషన్ భగీరథ అధికారులతో కూడా సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ఈ సమీక్షలో పట్టణ, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి బి దానకిషోర్, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, సాగునీటి శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ పాల్గొన్నారు.

## సింగరేణి రిటైర్డ్ కార్మికులకు దీపావళి బోనస్..

బలగం టీవి, హైదరాబాద్

సింగరేణి రిటైర్డ్ కార్మికులకు సంబంధించిన దీపావళి బోనస్ రూ.18.27కోట్లు ఈ నెల 27న ఖాతాల్లో జమ చేస్తామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరామ్ వెల్లడించారు. 2023-24 ఆర్థిక సంవత్సరం, ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అక్టోబర్ 24 మధ్య పని చేసి రిటైర్డ్ అయిన కార్మికులకు సంబంధించి పర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డు స్కీమ్ (దీపావళి బోనస్) సొమ్మును విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 27న ఆయా కార్మికుల ఖాతాల్లో దీపావళి బోనస్ జమవుతుందని సీఎండీ ఒక ప్రకటనలో వెల్లడించారు. దాదాపు 2,754 మంది కార్మికులకు దీపావళి బోనస్ కింద ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ.93,750 చొప్పున మొత్తంగా రూ.18.27కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 27న రిటైర్డ్ కార్మికుల ఖాతాల్లో జమ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆర్థిక, సిబ్బంది వ్యవహారాల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.

## చిన్న కాళేశ్వరానికి రూ.571 కోట్లు కేటాయింపు

బలగం టీవి, హైదరాబాద్

చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2007లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు పనులు ఇప్పటి దాకా 75శాతం పూర్తయ్యాయి. శనివారం ఎర్రమంజిల్ జలసౌధలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబుల సమక్షంలో ఉన్నతాధికారులతో సమీక్ష జరిగింది. చిన్న కాళేశ్వరం (ముక్తేశ్వర్) ఎత్తిపోతల పథకం పనులకు రూ.571.57 కోట్ల పరిపాలన అనుమతి లభించినట్లు సమీక్ష అనంతరం మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. మొత్తం 45 వేల ఎకరాలకు సాగునీరు, అర టీఎంసీ నీటిని మంచి నీటి సరఫరా కోసం వినియోగించనున్నట్లు ఆయన తెలిపారు.

# తెలంగాణ సొమ్మును
# ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో ఖర్చు పెడుతుండ్రు





- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం
- ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా మొండి చేయి చూపెడుతుంది..
- రాజకీయ వైషమ్యాలను పక్కనపెట్టి తెలంగాణ అభివృద్ధికి సహకరించండి.
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- రూ.23 కోట్ల కేంద్ర నిధులతో గంభీరావుపేటలో అభివృద్ధి పనులు ప్రారంభం

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

గతంలో కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల సొమ్మును పంజాబ్, కర్నాటక రాష్ట్రాల్లో ని రైతులకు ఖర్చు చేసిండు,ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే తోవల నడుస్తూ తెలంగాణ సొమ్మును మహారాష్ట్ర ఎన్నికల్లో ఖర్చు చేసింది అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు.శనివారం సిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట మండలంలో రూ.23 కోట్ల కేంద్ర నిధులతో అభివృద్ధి పనులను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. లింగన్నపేట నుండి కోరుట్లపేట వరకు నిర్మించిన రోడ్డును అ, గంభీరావుపేట నుండి మల్లారెడ్డిపేటకు వెళ్లే దారిలో నూతనంగా నిర్మించిన బ్రిడ్జిని అంతకుముందు మల్లారెడ్డిపేటలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించి, శ్రీ వీరాంజనేయ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గంభీరావుపేట లోని ఎల్లమ్మ దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ గతంలో గంభీరావుపేట ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు లింగన్నపేట నుండి కోరుట్లపేట వరకు రూ.15 కోట్ల వ్యయంతో రోడ్డును నిర్మించామని, అట్లాగే గంభీరావు పేట నుండి మల్లారెడ్డిపేట వరకు రూ.8.30 కోట్ల వ్యయంతో నూతనంగా బ్రిడ్జిని నిర్మించి, వాటిని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది అని అన్నారు.

గతంలోనూ కేంద్ర ప్రభుత్వం సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధికి ఎన్నో నిధులిచ్చింది అని అయితే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం వారి సొమ్ముగా ప్రచారం చేసుకున్నాయని,రాజకీయ వైషమ్యాలతో గత ప్రభుత్వం కుట్రలు చేసిందని, కేంద్ర ప్రభుత్వ నిధులను రాష్ట్ర ప్రభుత్వం నిధులగా చెప్పుకున్నదని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వం తోవలో నడుస్తోంది అని,రాజకీయ వైషమ్యాలు సృష్టించి అభివృద్ధి జరగకుండా చేస్తోంది అని అన్నారు.గత టిఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంతో వైరం పెట్టుకున్నాదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వంతో వైర్యం పెట్టుకుంటుందని, పేరు ప్రఖ్యాతుల కోసం మొండి పట్టుకు పోయి షో పొలిటిక్స్ చేస్తోంది అని అన్నారు. గతంలో వైర్యం పెట్టుకుంటే ఇది మంచి పద్ధతిగా అని చెప్పితే, రెండు నెలలు సఖ్యతగా ఉన్నదని, ఇప్పుడు మళ్లీ ధైర్యం పెట్టుకుంటుందని,ఇది మంచి పద్ధతి కాదు అని,మితిమీరి విమర్శలు చేసి తెలంగాణ ప్రజలకు అన్యాయం చేయొద్దని అన్నారు.

తెలంగాణ ప్రజల సొమ్మును ఇతర రాష్ట్రాల ఎన్నికల కోసం ఖర్చు పెట్టడం ఏ మాత్రం మంచి పద్దతి కాదు అని,ఇక్కడ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మొండి చేయి చూపింది అని అన్నారు.మహారాష్ట్ర ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం చేశారని, తెలంగాణలో ఆరు గ్యారంటీలను అమలు చేశామని ప్రచారం చేశారని, ఆరు గ్యారంటీలను తెలంగాణలో అమలు చేయలేదని, మహారాష్ట్ర ప్రజలు వాస్తవాలు గమనించారు అని అన్నారు. మహారాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ను నమ్మే పరిస్థితి లేదు అని, కాంగ్రెస్ ను ఓడించి బీజేపీకి పట్టం కట్టారు. అక్కడ వార్ వన్ సైడ్ అయ్యింది అని,జార్ఖండ్ లో టఫ్ ఫైట్ నడుస్తోంది. అని,ఇతర రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ బీజేపీ మెజారిటీ సీట్లు సాధించింది అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఆమోదం తెలిపారు అని,ప్రతి ఒక్క పార్టీ రాజకీయ వైషమ్యాలను పక్కనపెట్టి తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని అన్నారు. బిజెపి అధికార ప్రతినిధి రాణి రుద్రమ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి, బిజెపి మండల అధ్యక్షుడు గంట అశోక్, నాయకులు దేవేందర్ యాదవ్, మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, దేవసాని కృష్ణ, పత్తి స్వామి రాజ్, ప్రసాద్ రెడ్డి,లక్ష్మీ యాదవ్ రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మాస్టర్ ట్రెయినర్లకు శిక్షణ పూర్తి.. ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ షురూ

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

**బలగం టీవీ , సిరిసిల్ల**

సమగ్ర ఇంటింటి కుటుంబ (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల) సర్వేలో భాగంగా సర్వే పూర్తయిన కుటుంబాల సమాచారాన్ని కంప్యూటర్ ఆన్లైన్ సాఫ్ట్వేర్ లో నమోదు చేసేందుకు మాస్టర్ ట్రెనర్లకు శిక్షణ పూర్తి చేశామని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు .శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లాలోని 28 మంది మాస్టర్ ట్రైనర్లకు సర్వేలో సేకరించిన డాటా ఆన్లైన్ లో నమోదు చేసే విధానం పైఅదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ , జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి మండలానికి ఇద్దరు అలాగే ప్రతి మున్సిపాలిటీకి నలుగురు చొప్పున మొత్తం 28 మంది మాస్టర్ ట్రెయినీలకు రాజన్న సిరిసిల్ల కేంద్రంలో శిక్షణ పూర్తి చేశామని అన్నారు . అనంతరం మాస్టర్ ట్రైనర్లు మండల కేంద్రాలు, జిల్లాలోని ఆయా మున్సిపాలిటీల్లో ఎంపిక చేసిన 480 మంది ఆపరేటర్లకు సర్వేలో భాగంగా సేకరించిన అంశాల డాటా ఎంట్రీ పై శిక్షణ ఇచ్చారనిఅన్నారు .శిక్షణ పొందిన ఆపరేటర్లు డాటా ఎంట్రీ శనివారం(ఈ రోజు) నుంచి జిల్లాలో ప్రారంభించారని అన్నారు.



## ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి..

- సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ

**బలగం టీవీ సిరిసిల్ల**

ప్రతి వాహన దారుడు ఇంటి నుండి బయటకు వెళ్ళేటప్పుడు తప్పని సరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణంలోని నేతన్న చౌక్ వద్ద ట్రాఫిక్ నియమాలు ,రోడ్డు ప్రమాదాల నియమాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థుల చేత ఫ్లాష్ మాబ్ కార్యక్రమం ఏర్పాటు చేసి నిర్మూలనకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను తెలియజేస్తూ అవగాహన కల్పించారు.ఫ్లాష్ మాబ్ కార్యక్రమంలో ప్లకార్డ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరిని ఆకట్టుకున్నాయి.అనంతరం సిఐ కృష్ణ మాట్లాడుతూ ప్రతి వాహన దారుడు బయటకు వెళ్ళిన తన కోసం కుటుంబ సభ్యులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తుంటరన్న విషయాన్ని వాహన దారులు గుర్తించాలని అన్నారు.అనుకోని ప్రమాదాల వల్ల కుటుంబాలు ఇంటి పెద్ద దిక్కును కోల్పోతే కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందని కావున వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు.ప్రతి వాహన దారుడు తప్పకుండా హెల్మెట్, షీట్ బెల్ట్ ధరించాలని , అతి వేగం, ర్యాస్ డ్రైవింగ్, మద్యం త్రాగి డ్రైవింగ్ చేయటం, మొబైల్స్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయటం వంటివి చేయవద్దని,రాంగ్ రూట్ లో వాహనాలు నడుపవద్దని ప్రతి ఒక్కరు విధిగా ట్రాఫిక్ ,రోడ్ భద్రత నియమాలు పాటించాలి అన్నారు.ఈ కార్యక్రమం లో ఎస్ఐ దిలీప్ ఉన్నారు.

## నీలోఫర్ ఆస్పత్రిలో పసికందు కిడ్నాప్

**బలగం టీవీ , హైదరాబాద్**

నీలోఫర్ ఆస్పత్రిలో పసికందు కిడ్నాప్‌కు గురైన సంఘటన చోటుచేసుకుంది. గుర్తుతెలియని మహిళ పసికందును చికిత్స కోసం తీసుకుని వెళ్తున్నట్లు చెప్పి కిడ్నాప్ చేసింది. జహీరాబాద్‌కు చెందిన హసీనాబేగం, గఫర్ దంపతులకు బాబు జన్మించాడు. పసికందుకు జాండీస్ రావడంతో చికిత్స కోసం నీలోఫర్ ఆస్పత్రికి తీసుకుని వచ్చారు. ఈక్రమంలోనే డాక్టర్‌కు చూపించేందుకు వేచి చూస్తుండగా ఓ మహిళ వచ్చి బాబును చికిత్స కోసం తీసుకుని వెళ్తున్నానని బాబు తల్లికి చెప్పింది. తాను ఆస్పత్రి సిబ్బంది అని చెప్పడంతో మహిళ బాబును ఇచ్చింది. ఇలా బాబును తీసుకుని వెళ్లిన మహిళ చాలా సేపైనా తిరిగి రాకపోవడంతో భార్యభర్తలు కలిసి ఆస్పత్రి మొత్తం వెతకగా బాబు ఆచూకీ లభించలేదు, వెంటనే నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆస్పత్రి పరిసరాల్లో ఉన్న సిసిటివిల ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలిస్తున్నారు.

## మార్చిలోపు కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టుల పూర్తి చేస్తాం..

- బీఆర్ఎస్ ప్రభుత్వం మన ప్రాంత ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది.
- ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్

**బలగం టీవీ , వేములవాడ**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం మన ప్రాంత ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది అని,మార్చ్ లోపు కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.శనివారం చందుర్తి మండలం సనుగుల గ్రామంలో రుద్రంగి లోని రీడ్జ్ నుంచి లచ్చపేట తండా రిజర్వాయర్ ని నీటితో నింపడానికి కాలువ నిర్మాణానికి ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భూమి పూజ నిర్వహించారు..ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న పనులను నేడు ప్రారంభించుకోవడం జరుగుతుంది అని, ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి రూ. 1737 కోట్ల తో వేములవాడ నియోజకవర్గ లో 1 లక్ష ఎకరాలకు నీరు అందించడానికి అభివృద్ధి పనులు చేపట్టాడని అన్నారు.2009 మునుపు రుద్రంగి ప్రాజెక్టు చందుర్తి జోగపూర్ పంప్ హౌస్ ఫాజల్ నగర్ రిజర్వాలను పూర్తి చేసుకున్నామని అన్నారు.

గత ప్రభుత్వంలో గెలిచినవారు మన ప్రాంత ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారు అని,10 సంవత్సరాలుగా నిర్మాణానికి నోచుకోని పడవబడ్డ ప్రోజెక్టు,కాలువ ల నిర్మాణం ప్రారంభిస్తున్నామని అన్నారు.తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరు అందించే ప్రోజెక్టులలో శ్రీ పాద ఎల్లం పల్లి ప్రోజెక్టు మొదటి ప్రాధాన్యత లో పెట్టడం జరిగింది అని.మొన్నటి బడ్జెట్ లో 325 కోట్లు కేటాయించామని అన్నారు. గత ఎన్నికల్లో నన్ను ఓడగొట్టడానికి ఆనాడు హరీష్ రావు 201 కోట్లతో భూమి పూజ చేసి తట్టెడు మట్టి కూడా తీయలేదు అని,ఆనాడు కలికోట కోట



సూరమ్మ చెరువు కోసం ప్రతి నెల 22 నాడు అనేక ఆందోళనలు చేసామని, మళ్ళీ నిన్నటి 22 రోజున భూమి పూజ చేశామని అన్నారు.ఎర్ర చెరువు పటేల్ చెరువు కు నీళ్లతో నింపుతాం,లచ్చపేట తండా ప్రోజెక్టు త్వరలోనే పూర్తి చేస్తామని, వేములవాడ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిలో మన ప్రాంత ప్రాజెక్టును పూర్తి చేస్తామని మాట ఇచ్చారు అని అన్నారు. వేములవాడ పట్టణంలో ఆలయానికి విస్తరణ శంకుస్థాపన,నిత్యాన్నదాన సత్రం, రోడ్లు వెడల్పు లాంటి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు.గత ప్రభుత్వం సూరమ్మ చెరువు పనులకు 80 కోట్లు బకాయి పెడితే విడుదల చేశామని,కలికోట సూరమ్మ చెరువు కుడి ఎడమ కాల్వల భూసేకరణ కూడా చెయ్యలే దేదు అని, ప్రభుత్వం వచ్చిన తర్వాత గత వారం రోజుల కిందట 526 ఎకరాలకు భూసేకరణ కోసం నోటిఫికేషన్ ఇచ్చాం అని అన్నారు.రైతులు ఎవరు కూడా ఆందోళన చెందవద్దని, ప్రతి ఒక్కరికి నష్ట పరిహారం ఇస్తామని అన్నారు

## విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి



- విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెంపునకు కృషి చేయాలి...
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ , గంభీరావుపేట**

ప్రభుత్వ పాఠశాలలో, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెంపుకు కృషి చేయాలనీ ఉపాధ్యాయులను జ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శనివారం గంభీరావుపేట మండల కేంద్రం లోని కేజీ. టు పీజీ మరియు దమ్మన్నపేట లోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలను కలెక్టర్ సందీప్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు అంశాల పై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. వారి సందేహాలు నివృత్తి చేశారు. పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. విద్యార్థుల హాజరు పై ఆరా తీశారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పై ప్రత్యేక శ్రద్ధ వహించి మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లీష్ అంశాల్లో నిష్ణాతులను చేయాలని సూచించారు.

అనంతరం విద్యాలయం ఆవరణలో పరిశుభ్రత పనులు పరిశీలించారు. అనంతరం కిచెన్ లోకి వెళ్లి, కూరగాయలు, పండ్లు ఇతర పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. పలు కూరగాయలు, పండ్ల నాణ్యత లను పరిశిలించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లోకి వెళ్ళారు. ఉపాధ్యాయురాలు పాఠాలు బోధిస్తుండగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆఫర్లు, డిస్కౌంట్ల పేరుతో వచ్చే లింక్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలి

- సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...
- ఎస్పీ అఖిల్ మహాజన్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తతే ప్రధాన ఆయుధం ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. మొబైల్ ఫోన్ కి ఆఫర్లు, డిస్కౌంట్ల పేరుతో వచ్చే లింక్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని,అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్ లకు,కొత్త నంబర్ల నుండి వచ్చే ఏపీకే ఫైల్స్ డౌన్ లోడ్ చేస్తే మీ మొబైల్ హ్యాక్ అయ్యే అవకాశం ఉన్నందున వాటి పట్ల స్పందించవద్దు అని అన్నారు.సైబర్ మోసగాళ్లు మిమ్మల్ని ట్రాప్ చేయడానికి, ఫ్లీస్ చేయడానికి విభిన్నమైన కార్యనిర్వహణతో బయటకు వస్తున్నారని, వాటిని కట్టడికి అప్రమత్తత, అవగాహనే ఆయుధం అని అన్నారు . పోలీస్ యూనిఫాంతో ఎవరైనా వీడియో కాల్స్ చేస్తే కంగారు పడొద్దని,డిజిటల్ అరెస్ట్ అంటూ దబాయిస్తే స్పందించవద్దని, కేంద్ర దర్యాప్తు సంస్థలు,పోలీసుల పేరుతో వచ్చే కాల్స్ పట్ల జాగ్రత వహించలని,అసలు డిజిటల్ అరెస్ట్ అనే పద్ధతి లేనే లేదు అని అట్టి కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

సామాజిక మాధ్యమాల్లో అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల తీయని మాటల వలలో పడి వ్యక్తిగత విషయాలు, ఫోటోలు అస్సలు ఇవ్వవద్దని,వ్యక్తి గత విషయాల్లో ఎట్టి పరిస్థితుల్లో ఏమరుపాటుగా ఉండవద్దని ,సోషల్ మీడియా అకౌంట్స్ కి తప్పని సరిగా ప్రొఫైల్ లాక్ పెట్టుకోవాలని, సోషల్ మీడియా వేధికాకగా వేధిస్తే తక్షణమే పోలీస్ లు స్పందించాలని తెలిపారు. సైబర్ నేరాలకు గురి అయితే వెంటనే 1930 నంబర్ కు ఫోన్ చేయాలి. లేదా www.cybercrime.gov.in వెబ్ సైట్లో రిపోర్ట్ చేయాలి అని అన్నారు.

## తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలను, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివారలు,స్టేషన్ రికార్డ్ లు తనిఖీ చేసి కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని,ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని,ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని సూచించారు.



బ్లూ కోల్ట్ ,పెట్రో కార్ సిబ్బంది 100 డయల్ కాల్స్ కి తక్షణమే స్పందిస్తూ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు.పెట్రోలింగ్ సమయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతి రోజు తనిఖీ చేయాలని,స్టేషన్ పరిధిలో సీసీటీవీల ఏర్పాటు పై దృష్టి సారించి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు.విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా అధికారులు,విలేజ్ పోలీస్ అధికారులు తరచు గ్రామాలు పర్యటిస్తూ ప్రజలతో మమేకం అవుతు ప్రజలకు చట్టాల మీద డయల్100,షీ టీమ్స్, సైబర్ నేరాలు,ట్రాఫిక్ నియమాలు తదితర అంశాల మీద అవగాహన కల్పించాలని అన్నారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది కృషి చేయాలని సిబ్బంది, అధికారులు అందరూ విధులు సక్రమంగా విధులు నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. సి.ఐ మొగిలి,ఎస్.ఐ రామ్మోహన్,పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## మహిళ అదృశ్యం

- కనిపిస్తే సమాచారమివ్వండి : రక్షకభట నిలయం అధికారి పృధ్విధర్



**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం జగ్గరావుపల్లి గ్రామానికి చెందిన దొంతర వేణి ఎల్లవ్వ శుక్రవారం రోజున తప్పిపోయినదని, ఎల్లవ్వ కుమారుడు దొంతరవేణి కనకరాజు శనివారం రోజున మండల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని మండల ఎస్సై పృధ్విధర్ తెలిపారు.ఈ ఫోటోలోని మహిళ ఎక్కడైనా కనిపించినట్లయితే బోయినిపల్లి రక్షక భట నిలయం అధికారి పృధ్విధర్ 8712656418 ఈ ఫోన్ నెంబర్ కు సమాచారం అందించాలని అన్నారు.



## యువకుడిపై దాడి

- అట్రాసిటీ కేసు నమోదు

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ యువకుడు పై మరో యువకుడు విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరచగా బాధితుని ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ తెలిపారు. స్థానికుల, పోలీసుల వివరాల ప్రకారం కోనేటి రాము అనే వ్యక్తి ఆటోడ్రైవర్ గా పనిచేస్తున్నాడు. అతనికి అతని ప్రాణ స్నేహితుడు అయిన గోసికే గణేష్‌కు గత కొంతకాలంగా చిన్నచిన్న గొడవలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో రాము శుక్రవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో కిషన్ దాస్ పేటలోని ఓ ఇంటి వద్ద మాట్లాడుతుండగా గణేష్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంతో వెనకాల నుంచి బలంగా ఢీ కొట్టి కింద పడేశాడు.అనంతరం ఓ కట్టెతో కులం పేరుతో దూషిస్తూ విచక్షణ రహితంగా తలపై దాడి చేశాడు. ఈ దాడిని చూస్తున్న చుట్టుపక్కల వారు రామును గణేష్ నుంచి తప్పించి రక్షించారు. తీవ్ర గాయాలైన రామును స్థానికులు వెంటనే ఎల్లారెడ్డిపేటలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. కులం పేరుతో దూషించి హత్యకు ప్రయత్నించిన గణేష్ పై బాధితుడు శనివారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. డీఎస్పి చంద్రశేఖర్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. వీరిద్దరూ ప్రాణ స్నేహితంగా ఉంటూ ఒకరిపై ఒకరి దాడి చేసుకొని గాయపరచుకోవడంతో తోటి మిత్రులు షాక్‌కు గురయ్యారు.



## ముస్తాబాద్‌లో రేషన్ బియ్యం పట్టివేత

**బలగం టీవీ , ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం ఎస్సై గణేష్ పట్టుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామ శివారులోని వాహన తనిఖీ చేస్తుండగా చదువుల భాస్కర్, ఆనరాశి రాజేష్ అనే ఇద్దరు వ్యక్తులు తమ తమ ఆటోలల్లో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుపడ్డారు. వీరి వద్ద12 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ తరలించి వాహనాలు సీజ్ చేసి ఇరువురిపై కేసు నమోదు చేశామని తెలిపారు.



## గౌడ సంఘం సభ్యులకు ఉచిత గుండె వైద్య శిబిరం

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మండేపల్లి గ్రామంలో గౌడ సంఘం సభ్యులకు ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని గౌడ సంఘం నాయకులు ప్రారంభించారు. ఈ శిభిరంలో 150 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, మొదలగు సూపర్ స్పెషాలిటీ వైద్య పరీక్షలు చేశారు. ఆసుపత్రి డాక్టర్ హర్షిత్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిషన్ గౌడ్ మాట్లాడుతూ గౌడ సంఘం సభ్యులకు, స్థానిక ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతోనే ఈ వైద్య శిబిరం నిర్వహించామని అన్నారు. అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని అందుబాటులోకి తేవడమే కాకుండా నిరంతర సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ అధ్యక్షుడు గుర్రం బలరాం గౌడ్ మరియు పెద్ది లస్మయ్య గౌడ్,పెద్ది బాలచంద్రం ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, శ్రీకాంత్, లక్ష్మీ రాజం తదితరులు పాల్గొన్నారు.



## మండేపల్లిలో ముగిసిన వరి ధాన్యం కొనుగోలు

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం మండేపల్లి గ్రామంలో వరి ధాన్యం 12600 క్వింటల్లా ధాన్యాన్ని ప్యాక్స్ ఆధ్వర్యంలో కొనుగోలు చేశారు. సిరిసిల్ల ప్యాక్స్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 97560 క్వింటళ్ల వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్ గౌడ్ మాట్లాడుతూ మండలంలోని దాదాపుగా అన్ని గ్రామాలలో కొనుగోలు పూర్తి దశలో ఉన్నాయని మండేపల్లి లో ప్రతి చివరి గింజ వరకు కొనుగోలు చేశామని ఈ సందర్భంగా తెలియజేశారు. దీనికి సహకరించిన రైతులకు,అధికారులకు, హమాలీలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆస్పత్రుల్లో ఫైర్ సేఫ్టీపై తనిఖీలు చేయాలి

- తనిఖీల కోసం 10 బృందాలను ఏర్పాటు చేయాలి
- తొలుత గాంధీ, ఉస్మానియా, నీలోఫర్, ఎంజీఎం వంటి పెద్ద హాస్పిటళ్లలో తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలి
- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ



బలగం టీవీ, హైదరాబాద్

ప్రభుత్వ దవాఖాన్లలో ఫైర్ సేఫ్టీపై తనిఖీలు చేసి, నివేదిక తయారు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ అన్నారు. శనివారం ప్రభుత్వ, ప్రయివేటు హాస్పిటల్స్‌లో ఫైర్ సేఫ్టీ మెజర్స్‌పై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ సమీక్షించారు. ఈ మేరకు ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఇటీవల ఉత్తర ప్రదేశ్‌లోని ఓ దవాఖానలో ఫైర్ యాక్సిడెంట్ జరిగి పిల్లలు చనిపోయిన ఘటనపై మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు బాధాకరం అని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్స్ ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ దవాఖాన్లలో ఫైర్ సేఫ్టీపై తనిఖీలు చేసి, నివేదిక తయారు చేయాలని సూచించారు. తనిఖీల కోసం వెంటనే పది బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ బృందాలు తొలుత గాంధీ, ఉస్మానియా, నీలోఫర్, ఎంజీఎం వంటి పెద్ద హాస్పిటళ్లలో తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలన్నారు.

ఫైర్ అలార్మ్, స్మోక్ డిటెక్టర్స్ ఉన్నదీ, లేనిది పరిశీలించాలన్నారు. మంటలను ఆర్పే యంత్రాలు సరిపడా ఉన్నాయో? లేవో చూడాలని, వాటి తుది గడువు తేదీలను చెక్ చేయాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ, మంటలను ఆర్పే యంత్రాల వినియోగంపై హాస్పిటళ్లలో పనిచేసే సెక్యూరిటీ, ఇతర సిబ్బందికి ట్రైనింగ్ ఇవ్వాలని ఆదేశించారు. హాస్పిటళ్లలో పవర్ సప్లై సిస్టమ్‌ను పరిశీలించాలని, పాత ఎలక్ట్రిక్ కేబుల్స్ ఉంటే, వాటి స్థానంలో, నాణ్యమైన కొత్త కేబుల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫైర్ సేఫ్టీ, షార్ట్ సర్క్యూట్‌కు సంబంధించి Dos, Donts sign boards ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు.

హాస్పిటల్‌కు సమీపంలోని ఫైర్ స్టేషన్ సిబ్బందితో హాస్పిటల్ అధికారులు టచ్‌లో ఉండాలని, హాస్పిటల్స్‌లో రెగ్యులర్‌గా ఫైర్ సేఫ్టీ మాక్‌డ్రిల్స్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి హాస్పిటల్‌కు ఫైర్ ఎవక్యుయేషన్ ప్లాన్ రూపొందించాలని, ఆ ప్లాన్‌పై డాక్టర్లు, స్టాఫ్‌కు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. ఆ ప్లాన్‌కు సంబంధించిన సైన్ బోర్డులను హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేయాలన్నారు.

## 10 మంది నకిలీ వైద్యులు పట్టివేత

బలగం టీవీ, హైదరాబాద్

నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్ లను నడుపుతున్న వారిపై తెలంగాణ వైద్య మండలి దాడులు చేపట్టారు. ఈ మేరకు శనివారం చంపాపేట్, సైదాబాద్, కర్మన్ ఘాట్ ప్రాంతాల్లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ డా. శ్రీనివాస్ నేతృత్వంలో డా. ఇమ్రాన్ ఆలీ, డా రాజీవ్ బృందం తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 20 క్లినిక్ లు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్స్ పై తనిఖీలు నిర్వహించగా 10 మంది నకిలీ వైద్యులు పట్టుబడ్డారు. ఈ పది మంది నకిలీ వైద్యులు ఫస్ట్ ఎయిడ్‌లలో ఆసుపత్రి లో వలె నియమాలకి విరుద్ధంగా బెడ్స్ నిర్వహించడం తో పాటు,సెలైన్స్ పెట్టడం, యాంటీ బయోటిక్స్, స్టెరాయిడ్ ఇంజెక్షన్స్ ఇస్తునట్టు గుర్తించి తగు ఆధారాలు సేకరించారు. వీరిపై ఎన్ ఎం సి యాక్ట్ 34,54 ప్రకారం కేసులు నమోదు చేయనున్నామని డా శ్రీనివాస్ తెలియ చేశారు.

నియమాలకి కి విరుద్ధంగా ఆయుర్వేదిక్ వైద్యులు. గర్భిణీ స్త్రీలకు అల్లోపతి మందులు, హై డోస్ ఆంటిబయోటిక్ మందులు రాస్తున్న ట్టు గుర్తించారు. మహిళ ఆయుర్వేదిక్ వైద్యురాలు రాధా కుమారి గర్భిణీ స్త్రీలకు పరీక్షలు నిర్వహించడంతో పాటు నియమాలకు విరుద్ధంగా ఆలోపతి మందులు, ఆయుర్వేదిక్ వైద్యులు డా. రమేష్, డా వీరేష్ లు హై డోస్ ఆంటిబయోటిక్, స్టెరాయిడ్స్ ఇతర అల్లోపతి మందులు ఇస్తున్నట్లు గుర్తించామని, వీరిపై ఆయుష్ కౌన్సిల్ కి ఫిర్యాదు చేయడంతో పాటు, జిల్లా ఆరోగ్య, వైద్యాధికారికి ఫిర్యాదు చేయనున్నట్లు టీజీఎంసీ సభ్యుడు డా ఇమ్రాన్ ఆలీ తెలిపారు.

నకిలీ వైద్యులు అయిన ఆర్ ఎం పి, పీఎంపీల పైన ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 350 వరకు కేసులు ఫైల్ చేసామని, కొన్ని ఛార్జ్ షీట్ లు కూడా ఫైల్ అయి త్వరలోనే కోర్టు కు వెళ్ళానున్నాయని, నకిలీ వైద్యుల వలన జరిగే నష్టాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఇన్ని సంవత్సరాలుగా వీరి వలన జరిగిన, జరగబోయే నష్టాలను కోర్టు ముందు డాకుమెంట్స్ ద్వారా ఆధారాలతో సమర్పించనున్నట్లు చెప్పారు. నకిలీ వైద్య వ్యవస్థ పూర్తిస్థాయిలో పోయే విధంగా మరిన్ని చర్యలు తీసుకున్నామని టీజీఎంసీ వైస్ చైర్మన్ డా. శ్రీనివాస్ వివరించారు.

# ప్రాంతీయ పార్టీలే భారతీయ రాజకీయాల భవిష్యత్తు



- మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్

మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల ఫలితాలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. మహారాష్ట్ర, జార్ఖండ్ ఫలితాలు స్పష్టమైన సందేశాన్ని పంపాయని అన్నారు. ప్రాంతీయ పార్టీలు భారతీయ రాజకీయాల భవిష్యత్తు గా ఎప్పటి నుంచో ఉన్నాయి.. కొనసాగుతాయి. కాంగ్రెస్ బలమైన ప్రతిపక్షంగా అవతరించడంలో మహారాష్ట్రలో విఫలం అయిందన్నారు. ప్రాంతీయ పార్టీలను నాశనం చేయడంపై కాంగ్రెస్ దృష్టిపెట్టింది. ప్రతీసారి ఇదే పునరావృతం అవుతుందని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ అసమర్థత వల్లే బీజేపీ మనుగడ సాధిస్తుందని కేటీఆర్ విమర్శించారు. మహారాష్ట్రలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం, ఆయన సలహాలు, ప్రసంగాలు, బ్యాగులు, హెలికాప్టర్లు కాంగ్రెస్ ను ఘోర వైఫల్యం నుంచి కాపాడలేక పోయాయని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇప్పుడు మీరు ముఖ్యమంత్రిగా మీ ప్రాథమిక కర్తవ్యంపై దృష్టి సారించి, ఏడాది క్రితం తెలంగాణ ప్రజలకు మీరు వాగ్దానం చేసిన ఆరు హామీలను అందించగలరా? అని అన్నారు.

## హిందీ మహావిద్యాలయం గుర్తింపు రద్దు

బలగం టీవీ, హైదరాబాద్

నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల విద్యా ధ్రువీకరణ పత్రాలను ఫోర్జరీ చేసిన కళాశాలపై ఓయూ కఠిన చర్యలు తీసుకుంది. ఉత్తీర్ణులైన విద్యార్థులను ఫెయిలైనట్లుగా, ఫెయిలైన విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు తప్పుడు సమాచారాన్ని అందించిన హిందీ మహావిద్యాలయం గుర్తింపును రద్దు చేస్తూ ఉస్మానియా విశ్వవిద్యాలయం సంచలన నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల మార్కుల జాబితాలో అక్రమాలు జరిగినట్లు ఉస్మానియా యూనివర్శిటీ విచారణ కమిటీ తేల్చడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఓ ప్రయివేట్ కళాశాలలో ఉస్మానియా యూనివర్శిటీ అధికారుల సంతకాలు ఫోర్జరీ జరిగినట్లు విచారణ కమిటీ ఇటీవల నిర్ధారించింది. ఈ మేరకు హిందీ మహా విద్యాలయం స్వయం ప్రతిపత్తిని రద్దు చేయాలని యూజిసికి సిఫారసు చేసింది. కాగా ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు కోర్సు పూర్తి చేసేందుకు ఉస్మానియా యూనివర్శిటీ అవకాశం కల్పించింది.



## కాంగ్రెస్ మోసాలను మహారాష్ట్ర ప్రజలు గుర్తించారు

- మాజీ మంత్రి హరీశ్‌రావు

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణలో కాంగ్రెస్ చేసిన మోసాలను మహారాష్ట్ర ప్రజలు గుర్తించారని, అందుకే ఆ పార్టీకి ఎన్నికల్లో గుణపాఠం చెప్పారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. 5 గ్యారెంటీల పేరిట కాంగ్రెస్ చేసిన గారడీని మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదని ఈ ఎన్నికల ఫలితాలతో స్పష్టమైందన్నారు. తెలంగాణలో మహిళలకు రూ.2,500 ఇస్తామన్న మహాలక్ష్మి పథకం అమలు చేయకుండా మహారాష్ట్రలో రూ.3,000 ఇస్తామని హామీ ఇచ్చారని, రైతు భరోసా ఎగ్గొట్టారని, ఆసరా ఇవ్వకుండా దోఖా (మోసం) చేశారని, రైతు రుణమాఫీ ఏడాది గడుస్తున్నా పూర్తి చేయలేదని హరీశ్ రావు పేర్కొన్నారు. ఈ అంశాలన్నీ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపాయని వెల్లడించారు. తెలంగాణ ప్రజలు మహారాష్ట్రలోని ముంబై, షోలాపూర్, పుణే, నాందేడ్ వంటి ప్రాంతాల్లో అత్యధికంగా నివసిస్తుండడం వలన కాంగ్రెస్ ఇక్కడ చేసిన మోసాల గురించి మహారాష్ట్రలో చాలా ప్రచారం జరిగిందని పేర్కొన్నారు.

అలాగే, హేమంత్ సోరేన్‌పై పెట్టిన అక్రమ కేసులు, అరెస్టులు, పార్టీని చీల్చే ప్రయత్నాలను చూసిన ఝార్ఖండ్ ప్రజలు బీజేపీని తిప్పికొట్టారని రాసుకొచ్చారు. బీజేపీ కక్ష సాధింపు విధానాలను ప్రజలు హర్షించడం లేదని తేలిపోయిందని పేర్కొన్నారు. విజయం సాధించిన హేమంత్ సోరేన్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

# పదిరోజులకో పసిబిడ్డ ప్రాణం పోతోంది

- ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరించడంసరికాదు
- తక్షణమే మరణించిన 42 మంది పిల్లల కుటుంబ సభ్యులకు రూ 10 లక్షల నష్టపరిహారం అందించాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్
- నిమ్స్ లో చికిత్స పొందుతున్న విద్యార్థిని శైలజను ఎమ్మెల్సీ కవిత



బలగం టీవీ, హైదరాబాద్

ఎనతీరోజులకో పసిబిడ్డ ప్రాణం పోతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పసి బిడ్డల ప్రాణాలను ప్రాధాన్యతగల అంశంగా స్వీకరించి తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు ఏ ఒక్క పాఠశాలను చూసినా ఏదో ఒక సంఘటన జరిగిన దాఖలాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల వ్యవస్థ ధ్వంసమైన పరిస్థితి కనిపిస్తోందని స్పష్టం చేశారు. మరణించిన 42 మంది పిల్లల కుటుంబ సభ్యులకు రూ 10 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని శైలజను, ఆమె కుటుంబ సభ్యులను శనివారం నాడు ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ... తరుచూ ఇలాంటి ఘటనలు జరుగుతుండడం చాలా బాధాకరమని అన్నారు. శైలజ ఇంకా కూడా వెంటిలెటర్ పై ఉన్నట్లు తెలియజేశారు. పసిబిడ్డల ప్రాణాలు పోతుంటే ప్రభుత్వం పట్టనట్టు ఉండడం సరికాదని సూచించారు.

"ప్రభుత్వం వచ్చి 11 నెలలు అవుతుంది, సగటున నెలకు ముగ్గురు చొప్పున ఇప్పటి వరకు 42 మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బిడ్డలు ప్రభుత్వ నిర్లక్ష్యం కార ణంగా ఆహారం విషతుల్యమయ్యి మరణించారు. సగటున పదిరోజులకు ఒక పసి ప్రాణాన్ని ప్రభుత్వం పొట్టన పెట్టుకుంటోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని సంక్షేమ శాఖలు కూడా ముఖ్యమంత్రి వద్ద ఉండడం వల్ల సమయం వెచ్చించలేకపోతున్నట్లు కనిపిస్తోం దన్నారు. కనీసం పది నిమిషాల సమయాన్ని కేటాయించి సమీక్ష చేస్తే పసి ప్రాణాలను కాపాడే పరిస్థితి ఉంటుందని సూచించారు.

నారాయణపేట హాస్టళ్లో విషతుల్య ఆహారం తినడం కారణంగా పిల్లలు అనారోగ్యం పాలైన తర్వాత ముఖ్యమంత్రి సమీక్ష చేసిన మరునాడే అలాంటి మరో సంఘటన జరగడం ఆందోళనకరమన్నారు. పిల్లలు కూడా ధర్నా చేస్తున్నారని గుర్తు చేశారు. గతంలో కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదవే పిల్లలు ఐటీ, ఐఐఎంకు వెళ్లాలా లేకపోతే ఎవరెస్టు అధిరోహించాలా అన్న ఉన్నతమైన ఆశయాలు, లక్ష్యాలతో వెళ్లిన సందర్భాన్ని తెలంగాణ సమాజం చూసిందని గుర్తు చేశారు.




# నేటి నుంచే మెగా వేలం

**బలగం టీవీ, జెడ్డా**

ఐపీఎల్ మెగా వేలానికి వేళైంది. సౌదీ అరేబియాలోని జెడ్డా వేదికగా ఆదివారం, సోమవారం మెగా ఆక్షన్ జరగనుంది. ఐపీఎల్ మెగా వేలం భారత కాలమాన ప్రకారం మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభం కానుంది. స్థానికంగా మధ్యాహ్నం 1 గంటకు మొదలవుతుంది. గంటన్నర పాటు వేలం జరిగిన తర్వాత 45 నిమిషాలు లంచ్ బ్రేక్ ఉంటుంది. ఆ తర్వాత స్థానికంగా రాత్రి 8 గంటల వరకు వేలం కొనసాగుతుంది.

ఐపీఎల్ మెగా ఆక్షన్‌ను టీవీలో చూడాలంటే స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌కు సంబంధించిన ఛానెళ్లలో వీక్షించాలి.జియో సినిమా యాప్ ద్వారా మొబైల్స్‌లో లైవ్ ఉచితంగా చూడవచ్చు. జియో సినిమా వెబ్‌సైట్‌లోనూ ఫ్రీగా ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించవచ్చు. ఐపీఎల్ మెగా వేలానికి 1574 మంది ఆటగాళ్లు తమ పేర్లను నమోదు చేసుకోగా, అందులో ఫ్రాంచైజీల సూచనల మేరకు బీసీసీఐ 577 మందినే షార్ట్ లిస్ట్ చేసింది. వాళ్లలో మొత్తంగా 204 ప్లేయర్లను కొనుగోలు చేయడానికి ఫ్రాంచైజీలు సిద్ధమయ్యాయి. ఇందులో 70 మంది విదేశీ ప్లేయర్లు ఉండనున్నారు.

షార్ట్ లిస్ట్‌లోని ఆటగాళ్లలో 82 మంది రూ.2 కోట్ల రిజర్వ్ ధరతో మెగా వేలానికి వస్తున్నారు. 27 మంది ఆటగాళ్లు రూ.1.50 కోట్లు, 18 మంది ప్లేయర్లు రూ.1.25 కోట్లు, 23 మంది రూ. 1 కోటి, 92 మంది రూ.75 లక్షలు, 8 మంది రూ. 50 లక్షలు, అయిదుగురు రూ.40 లక్షలు, 320 మంది కనీస ధర రూ.30 లక్షలతో వేలంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

ఆరుగురు చొప్పున ఆటగాళ్లతో రెండు మార్క్యూ లిస్ట్‌లు ఉన్నాయి. ఎమ్-1లో రిషబ్ పంత్, శ్రేయస్ అయ్యర్, జోస్ బట్లర్, అర్షదీప్ సింగ్, కగిసో రబాడ, మిచెల్ స్టార్క్ ఉన్నారు. ఎమ్-2లో కేఎల్ రాహుల్, యుజువేంద్ర చాహల్, లివింగ్‌స్టోన్, డేవిడ్ మిల్లర్, మహ్మద్ షమి, మహ్మద్ సిరాజ్ ఉన్నారు. ఈ మార్క్యూ లిస్ట్‌లతో వేలం ప్రారంభమవుతుంది. ఆ తర్వాత బ్యాటర్లు, ఫాస్ట్ బౌలర్లు, వికెట్ కీపర్లు, స్పిన్నర్లు, ఆల్‌రౌండర్లు విభాగాలుగా వేలం జరుగుతుంది. అన్‌క్యాప్డ్ ప్లేయర్లలోనూ ఇదే తరహా వేలం జరుగుతుంది.

ఇక పంజాబ్ కింగ్స్ వద్ద అత్యధికంగా రూ.110.5 కోట్లు ఉన్నాయి. అత్యల్పంగా రాజస్థాన్ రాయల్స్ వద్ద రూ. 41 కోట్లు ఉన్నాయి. ఇక సీఎస్కే- రూ.55 కోట్లు, ఢిల్లీ క్యాపిటల్స్- రూ. 73 కోట్లు, కేకేఆర్- రూ. 51 కోట్లు, ఆర్సీబీ- రూ. 53 కోట్లు, లక్నో- రూ. 69 కోట్లు, ముంబై ఇండియన్స్- రూ.45 కోట్లు, ఎస్ఆర్‌హెచ్- రూ.45 కోట్లు, గుజరాత్ టైటాన్స్- రూ. 69 కోట్లు ఉన్నాయి.

# పట్టు బిగించిన భారత్

**బలగం టీవీ, పెర్త్**

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా పెర్త్ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్టులో భారత జట్టు పట్టు బిగించింది. ఆతిథ్య జట్టును తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 104 పరుగులకే కుప్పకూల్చిన టీమిండియా.. రెండో ఇన్నింగ్స్‌లో అద్భుతంగా బ్యాటింగ్ చేస్తోంది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (88), కేఎల్ రాహుల్ (59) అర్ధ శతకాలు నమోదు చేశారు. అలాగే తొలి వికెట్‌కు శతక భాగస్వామ్యం అందించారు. దాంతో రెండో రోజు ఆట ముగిసే సరికి భారత జట్టు వికెట్ కోల్పోకుండా 172 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌తో 46 పరుగులు కలుపుకుని భారత్ 218 పరుగుల ఆధిక్యంతో ఉంది.

టీమిండియా రెండో రోజు సంపూర్ణ ఆధిపత్యంలో ఉంది. ఆసీస్ బ్యాటర్లు తడబడిన చోట ఓపెనర్లు యశస్వీ జైస్వాల్(90 నాటౌట్), కేఎల్ రాహుల్(62 నాటౌట్)లు అద్భుతంగా ఆడారు. నింపాదిగా ఆడుతూ టీమిండియా ఆధిక్యాన్ని రెండొందలు దాటించారు. అయితే 2004 తర్వాత టెస్టుల్లో ఆస్ట్రేలియా గడ్డపై భారత్ 100 ప్లస్ పరుగుల ఓపెనింగ్ నమోదు చేయడం ఇదే తొలిసారి.




**104 పరుగులకు ఆస్ట్రేలియా ఆలౌట్**

అంతకుముందు ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఇన్నింగ్స్ ఆరంభించిన ఆస్ట్రేలియా జస్ప్రీత్ బుమ్రా(5/30), హర్షిత్ రానా(3/48)ల ధాటికి తొలి సెషన్‌లోనే కుప్పకూలింది. దాంతో, టీమిండియాకు 46 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం యశస్వీ, రాహుల్‌లు అజేయంగా అర్ధశతకాలు బాదడంతో రెండో రోజు ఆట ముగిసే సరికి భారత జట్టు 172 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌తో కలిపి 218 పరు గుల ఆధిక్యంతో ఉంది. ఇక భారత జట్టు తన తొలి ఇన్నింగ్స్ లో 150 రన్స్‌కి ఆలౌట్ అయిన విషయం తెలిసిందే.

# మూడో స్థానానికి దబాంగ్ ఢిల్లీ

**బలగం టీవీ, నోయిడా**



ప్రోకబడ్డీ లీగ్ సీజన్-11లో దబాంగ్ ఢిల్లీ సత్తా చాటుతోంది. నొయిడా వేదికగా జరిగిన మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్‌పై ఢిల్లీ 35-21 పాయింట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గత అయిదు మ్యాచ్‌ల్లో ఓటమెరుగని దబాంగ్ ఢిల్లీ (40) పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది. అయిదింట్లో రెండు మ్యాచ్‌లు టై అయిన విషయం తెలిసిందే. తొలి రెండు స్థానాల్లో హర్యానా స్టీలర్స్ (46), తెలుగు టైటాన్స్ (42) ఉన్నాయి.

మ్యాచ్ ఆరంభం నుంచే దబాంగ్ ఢిల్లీ పాయింట్ల మోత మోగించింది. తొలి అర్ధభాగాన్ని 17-9తో భారీ ఆధిక్యంతో ముగించింది. జైపూర్ పింక్ పాంథర్స్‌ను ఒక్కసారి ఆలౌట్ చేసింది. రెండో అర్ధభాగంలో జైపూర్ పుంజుకున్నప్పటికీ ఢిల్లీ ముందు నిలవలేకపోయింది. మరోసారి ఆలౌటై పాయింట్లు సమర్పించుకుంది. ఈ క్రమంలో దబాంగ్ 14 పాయింట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. ఢిల్లీ విజయంలో కెప్టెన్ అషు మాలిక్ 9 పాయింట్లతో కీలక పాత్ర పోషించాడు. జైపూర్ కెప్టెన్ అర్జున్ దేశ్వాల్ 7 పాయింట్లతో పోరాడాడు. నొయిడా వేదికగా అంతకుముందు జరిగిన మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్‌పై యూపీ యోధాస్ 40-24 పాయింట్లతో ఘన విజయం సాధించింది.

# నాగచైతన్య కొత్త సినిమా పోస్టర్ విడుదల

## పుట్టినరోజు నాడు ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజ్ ఇచ్చిన నాగచైతన్య

**బలగం టీవీ, హైదరాబాద్**




అక్కినేని నాగచైతన్య తన పుట్టినరోజు నాడు ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఈ మేరకు కొత్త సినిమాను ప్రకటించారు. సుకుమార్ రైటింగ్స్ నుంచి ఈ చిత్రం రానుంది. కార్తిక్ దండు దర్శకత్వం వహించనున్నారు. పౌరాణిక కథ నేపథ్యంలో ఇది తెరకెక్కనుంది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ ఓ కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేసింది. విరూపాక్ష, కాంతార సినిమాలకు సంగీతం అందించిన లోకాంత్ ఈ కొత్త సినిమాకు సంగీతం అందించనున్నారు.

అలాగే నాగ చైతన్య ప్రస్తుతం 'తండేల్' సినిమాలో నటిస్తున్నారు. చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తోంది. ఫిబ్రవరి 7న ఈ చిత్రం రిలీజ్ కానుంది.

# పుష్ప 2' నుంచి 'కిస్సిక్' సాంగ్ ప్రోమో విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

డిసెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా పుష్ప 2 విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే మూవీ నుంచి ట్రైలర్‌తో పాటు పలు పాటలు విడుదల చేశారు. ఇదిలావుంటే మూవీ నుంచి ఐటం సాంగ్‌ను కూడా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. కిస్సిక్ అంటూ ఈ సాంగ్ రాబోతుండగా.. తాజాగా ఈ పాటకు సంబంధించిన ప్రోమోను మేకర్స్ విడుదల చేశారు. ఫుల్ సాంగ్‌ను నవంబర్ 24న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ తెలిపింది.







# యుఎస్‌లో 'గేమ్ చేంజర్' ప్రీ రిలీజ్ ఈవెంట్

**బలగం టీవీ, హైదరాబాద్**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్'. ఈ సినిమాను శ్రీమతి అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ అన్‌కాంప్రమైజ్డ్‌గా నిర్మిస్తున్నారు. అయితే ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ డిసెంబర్ 21న అమెరికాలో అత్యంత భారీగా జరగనుంది. కర్టిస్ కల్వెల్ సెంటర్, 4999 నామన్ ఫారెస్ట్, గార్లాండ్ టి.ఎక్స్ 75040 ఈ ముందస్తు వేడుకకు వేదిక కానుండటం విశేషం. చిత్ర యూనిట్‌తో పాటు ప్రముఖులందరూ ఈ వేడుకకి హాజరుకాబోతున్నారు. ఈ సందర్భంగా 'ఛరిష్మా డ్రీమ్స్' ప్రొడ్యూసర్, యు.ఎస్ ఎగ్జిబిటర్ రాజేష్ కల్లెపల్లి మాట్లాడుతూ "తెలుగు సినిమాల్లోనే కాదు, ఇండియన్ సినీ ఇండస్ట్రీలోనే ఇప్పటి వరకు యు.ఎస్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించలేదు. తొలిసారి గేమ్ చేంజర్ సినిమా కోసం భారీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను అమెరికాలో చేయబోతున్నందుకు ఆనందంగా ఉంది. ఈవెంట్‌ను సక్సెస్‌ఫుల్‌గా చేయటానికి ప్లానింగ్ చేస్తున్నాం. హీరో రామ్ చరణ్‌గారు, నిర్మాతలు దిల్‌రాజు, శిరీష్, శంకర్‌గారు అండ్ టీమ్‌కు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను" అన్నారు.